పుస్తకాలు అందక.. చదువులు సాగక

- నాలుగు నెలలైనా ప్రీస్కూళ్లకు పుస్తకాలు, కిట్లు మంజూరు చేయని ప్రభుత్వం
- పాత పుస్తకాలతోనే నెట్టుకొస్తున్న టీచర్లు
- విద్యాబోధన చేసేందుకు ఇబ్బందులు

ఆదోని సెంట్రల్: పేద మధ్యతరగతి పిల్లలు నష్ట పోకూడదని ప్రైవేట్ బడులలో ఉన్న ఎల్‌కేజీ, యుకేజీ మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌ను ప్రవేశ పెట్టారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం బాల్య దశలోనే పిల్లలకు గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలైనా ఇంతవరకూ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనం.

సంస్కరణలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

బాల్యంలోనే చిన్నారులు విజ్ఞానంతో పాటు ఇంగ్లిషుపై పట్టు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యనందిచేందుకు పుస్తకాలను పంపిణీ చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విధానానికి మంగళం పాడింది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ప్రీ స్కూల్ పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేయలేదు. దీంతో పాత పుస్తకాలు, కిట్లతోనే అంగన్‌వాడీ టీచర్లు విద్యా బోధనను కొనసాగిస్తున్నారు.



పాత పుస్తకాలతోనే విద్యా బోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఆదోని నియోజకవర్గంలో 224 అంగన్‌వాడీ కేంద్రాలు..

ఆదోని పట్టణంలో 126 అంగన్‌వాడీ కేంద్రాల్లో 10,705 మంది, గ్రామీణ ప్రాంతాల్లోని 98 అంగన్‌వాడీ కేంద్రాలలో 9,167 మంది పిల్లలు ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు నియోజకవర్గంలో 15వేల మంది అంగన్‌వాడీ కేంద్రాలు వస్తున్నారు. వీరందరికీ కేంద్రాల్లో కథలు చెప్పడం, సృజనాత్మక పనులు, యాక్షన్ పాటలును వివరిస్తారు. అయితే ఈ ఏడాది ఇంతవరకూ పాఠ్యపుస్తకాలు రాలేదు. దీంతో అంగన్‌వాడీలు పాత పుస్తకాలు, కిట్లతోనే అరకొరగా విద్య బోధన కొనసాగిస్తున్నారు. పుస్తకాలు ఎలా సర్దుబాటు చేయాలో అర్థంకాక, విద్యా బోధన ఎలా కొనసాగించాలో తెలియక పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిట్ల పంపిణీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల తరహాలోనే విద్యా బోధన కొనసాగించేందుకు బర్డ్-1 కిట్లను అందజేసింది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు ఇంగ్లిషు, గణితం, స్పోకెన్ ఇంగ్లిషు యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లను, ఐదేళ్లలోపు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను ఇచ్చారు. దీంతో పిల్లలకు విద్యా బోధన సులభంగా అర్థమయ్యే రీతిలో సాగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే పాత పుస్తకాలు ఉన్నప్పటికీ కొన్ని చినిగి పోయి అస్తవ్యస్తంగా మారాయి. అందులో ఒకరికి పుస్తకం ఉంటే మరోకటి ఉండదు. దీంతో చిన్నారులకు విద్యా బోధన అందించడం కష్ట సాధ్యంగా మారిందని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూర్చే విధంగా..

కూటమి ప్రభుత్వం పుస్తకాలకు స్వస్తి పలికి మళ్లీ పాత విధానాన్నే అమల్లోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ప్రీ స్కూల్ ఎక్కడ చేరితే అక్కడే ఉన్న పాఠశాలలో విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంది. ఒక వేళ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తే పిల్లలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత కూడా విద్యా బోధన ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగిస్తారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది.

"పుస్తకాలు రాలేదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు ప్రభుత్వం ప్రీప్రైమరీ విద్యను అందిస్తుంది. పేద, మధ్యతరగతి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్రంలోని ప్రతి పిల్లవాడికి పీపీ-1, పీపీ-2 కిట్లను పంపిణీ చేస్తుంది. ఈ సంవత్సరం ఇంకా రాలేదు. అధికారులు వస్తాయని చెపుతున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియదు. వస్తే తప్పకుండా ప్రతి కేంద్రానికి పుస్తకాలను పంపిణీ చేసి విద్యా బోధన అందించడానికి కృషి చేస్తాం.

–ఉమామహేశ్వరి, సీడీపీఓ, ఆదోని.

క్లుప్తంగా

ఉరుకుంద విద్యార్థికి బంగారు పతకం



నాగరాజు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద జెడ్పీ పాఠశాల విద్యార్థి బంగారు పతకం సాధించాడు. గురువారం కర్నూలులో జరిగిన అండర్-14 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం సునీతదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్న తెలిపారు. 9వ తరగతి చదువుతున్న నాగరాజు బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

28న టీటీడీ దేవస్థానంలో పూజలు



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఈనెల 28న పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో వెంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి గురువారం తెలిపారు. తిరుమల లడ్డుపై విష ప్రచారం చేస్తున్న కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ పూజలు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో సైతం పార్టీ కార్యకర్తలు, నాయకులు పూజలు చేయాలని, కూటమి నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించు స్వామి అంటూ వేడుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థితో ఉపాధ్యాయ బృందం

కౌతాళం: జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు బదినేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింహరాజులు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థి మారెప్పను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థి మారెప్ప ఇటీవల ఆదోని నిర్వహించిన రాష్ట్ర స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాన్నారు. ఈనెల 27నుంచి 29వరకు పాండిచ్చేరిలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు.

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: పిల్లలకు పోషకాహారం ఇవ్వాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ లీలావతి సూచించారు. గురువారం సీడీపీఓ ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో ఆదోని మండలం మదిరె గ్రామంలో పోషణ మాసోత్సవాలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ పిల్లలకు అంగట్లో దొరికే చిప్స్, బేకరీ అయిటమ్స్‌కు దూరంగా ఉంచాలన్నారు. వీటి వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం అందించే బాలామృతం పిల్లలకు పెట్టాలన్నారు. ఈ ఆహారం వారి ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమములో సూపర్ వైజర్ సునీత, కార్యకర్తలు ఎంకమ్మ, ధనలక్ష్మి, సుగుణ, మున్ని, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో తమ ప్రతిభను చాటారని పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. వ్యాయమ ఉపాధ్యాయులు రవి, గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం జమ చేయండి

కౌతాళం: ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద వెంటనే రూ.20వేలు వారి ఖాతాలకు జమ చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగించే జీవో నెంబర్22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు ఉలిగయ్య, సత్యప్ప, వీరేష్, రామలింగ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలి

ఆదోని సెంట్రల్: ఆదోనిలో అర్ధంతరంగా నిలచిపోయిన మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం యుటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం బాధ్యతలను విస్మరించి విద్యను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీంతో 700 సీట్లు నష్టపోయామన్నారు. గౌస్,నాగరాజు, భరత్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా రాజునాయక్



ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ డీఈగా రాజునాయక్ నియామకమయ్యారు. ఆదోని మున్సిపాలిటీలో పని చేస్తున్న ఆయన గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డిని కలిసి బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈగా పనిచేసిన మనోహర్‌రెడ్డి కర్నూలుకు బదిలీ అయ్యారు.

నేడు స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానం (టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన) శుక్రవారం అవోపా, వామ్ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందును 3వ విడత కింద పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్త గురువాతం తెలిపారు. ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల పిల్లలకు ఉదయం 7 గంటల నుంచి ప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఔషధం వలన రోగనిరోధకశక్తి , మేధాశక్తి, ఆయుష్షు, చర్మ సౌందర్యా ర్యం పెంచేందుకు, మానసిక శారీరక ఎదుగుదలకు దోహదం పడుతుందన్నారు. సెల్ 9849478178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రందించి పిల్లల పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. రిజిష్టర్ చేసుకున్న వారికి మాత్రమే ఔషధాన్ని అందజేస్తామని చెప్పారు.

పెద్దహరివాణం విద్యార్థులకు చాంపియన్‌షిప్

ఆదోని రూరల్: ఈనెల 24, 25వ తేదీల్లో ఆదోనిలోని మున్సిపల్ పాఠశాల మైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఛాంపియన్‌షిప్ సాధించినట్లు హెచ్‌ఎం ఇందిరాదేవి తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో కప్ సాధించిన విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో విన్నర్స్‌గా, అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో విన్నర్స్, అండర్-17 బాలికల చెస్ విభాగంలో విన్నర్స్, అండర్-14 బాలుర కబడ్డీ విభాగంలో రన్నర్స్‌గా, అండర్-14 బాలికల కబడ్డీ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారన్నారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రామన్నను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు రామకృష్ణ, రమణమూర్తి, యల్లప్ప, చిరంజీవి, గణేష్, యశోద, శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని వెంకటేశ్వరమ్మ

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని బి.వెంకటేశ్వరమ్మ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గిరిజాదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థినిని అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో వెంకటేశ్వరమ్మ ప్రతిభ కనబరిచి అండర్-14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయినా విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు కీరాను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగప్రసాద్, శిరీష, మౌలాలి, శశికాంత్, అమీనాబీ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కనకవీడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గౌరమ్మ, ఫిజికల్ డైరక్టర్ ఈరన్న తెలిపారు. గురువారం పాఠశాలలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన చెస్, యోగా పోటీల్లో వీరబాబు, వీరేంద్ర జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. అలాగే కబడ్డీ అండర్-14 విభాగంలో బాలురు ప్రకాష్, రవీంద్ర, రఫీక్, బాలికల విభాగంలో వీరేశమ్మ, శైలజ, గౌతిమి, అనసూయ, శారద ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్ఞాన ప్రకాష్, విజయ్, రాము, రామాంజనేయులు, నాగరాజు, వెంకటేశప్ప పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టులో స్థానం


ఎమ్మిగనూరుటౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కేసీ సౌమ్య ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. గురువారం పాఠశాలలో సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సుజనకుమారి, నాగేశ్వరిలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ. ఈనెల 28 నుంచి పల్నాడు జిల్లా వినుగొండలో జరిగే రాష్ట్ర స్థాయి 17 బాలికల విభాగం ఫుట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థిని పాల్గొంటుందని చెప్పారు.



ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన కేసీ సౌమ్యతో హెచ్‌ఎం

దర్గాకు తరలివచ్చిన భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులందరికీ ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

ప్లాటినం జూబ్లీ వేడుకలు వాయిదా



మాట్లాడుతున్న పూర్వవిద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 29న నిర్వహించనున్న ప్లాటినం జూబ్లీ పూర్వ విద్యార్థుల మహాసమ్మేళన కార్యక్రమం వాయిదా వేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. గురువారం పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్లాటినం జూబ్లీ వేడుకల కమిటీ సభ్యులు, పూర్వవిద్యార్థులు మాచాని శివకుమార్, ప్రకాష్‌జైన్, హరినారాయణ రెడ్డి, మాచాని వెంకటేష్, బైలుప్పుల షఫివుల్లా మాట్లాడారు. వాతవరణ మార్పులతో వర్షాలు కురిసే అవకాశం వున్నందున, కొన్ని అనివార్య కారణాలతో వేడుకలను తాత్కాలికంగా వాయిదా వేసేందుకు కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేంది తరువాత ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో వేడుకల కమిటీ సభ్యులు కామలె గణేష్, ఈరన్న గౌడ్, తుక్కా నట్‌రాజు, టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ఎమ్మిగనూరు టౌన్: పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక ఆర్టీసీ డీఎం అమర్నాథ్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ కుమార్, సిబ్బంది బాలాంజినేయులు, ముస్తఫ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డీఎం అమర్నాథ్, సిబ్బంది

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి సస్పెన్షన్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయిని సస్పెండ్ చేస్తూ గురువారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రికి ఉత్తర్వులు చేరాయి. డాక్టర్ మైత్రేయి విధుల పట్ల నిర్లక్ష్యం, బేబీ డెత్‌కు కారణమని జిల్లా వైద్యాధికారుల విచారణలో నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఎస్‌బీ ఎస్ఐకు ఉత్తమ అవార్డు



ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజ్

మంత్రాలయం: ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజ్‌కు ఉత్తమ పురస్కారం దక్కింది. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజవర్గాల్లో కేసుల ఛేదనతోపాటు వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ వేడుకలను ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నందుకు ఈ అవార్డు దక్కింది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా వెంకటరాముడు

మంత్రాలయం: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా వెంకట రాముడు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన నందవరం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వేద స్వరూప కర్నూలు ఎస్ఈ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

పాడుబడిన బావిని పూడ్చాలి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దపెండేకల్ గ్రామంలోని దర్గా వద్ద ఉన్న పాడుబడ్డ బావిని పూడ్చివేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం అందించారు. గ్రామస్తులు రామాంజనేయులు, మునిస్వామి, గోవిందు, రేష్మ, రఫిక్, తరుణ్, ఫామిద తదితరులు మాట్లాడుతూ బావి ప్రస్తుతం వినియోగంలో లేదన్నారు. బావిలోకి చెత్తాచెదారం, చనిపోయిన కుక్కలను పడేస్తున్నారన్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుందని చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గోనెగండ్ల : వాహనదారులు, ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. గురువారం గాజులదిన్నె క్రాస్ రోడ్డు వద్ద ప్రైవేట్ స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తనిఖీ చేశారు. ఆటో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడం, అజాగ్రత్తగా నడుపుతున్న ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో గురువారం పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం తగదని సిబ్బందిని హెచ్చరించారు. పట్టణంలో రోడ్లపై సంచరించే ఆవులను ఆదోని గోశాలకు తరలించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యుత్ షాక్‌తో బెంగళూరు ఎలక్ట్రీషియన్ మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శివ సర్కిల్లో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో కరెంట్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై బెంగళూరుకు చెందిన ఎలక్ట్రీషియన్ మహమ్మద్ మెహిన్ పాషా(18) బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పట్టణంలో నూతనంగా ప్రారంభం కానున్న ఎల్లో మెటల్ గోల్డ్ లోన్ ప్రైవేట్ బ్యాంక్‌లో బెంగళూరుకు చెందిన ఎలక్ట్రీషియన్లు మహమ్మద్ మోహిన్‌పాష, ఫాజీలి అహమ్మద్, షాయూబ్‌పాషాలు విద్యుత్ పనులు చేస్తుండగా అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో షాట్ సర్క్యూట్ కావడంతో కిందపడిపోయారు. అక్కడే ఉన్నవారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మోహిన్‌పాషా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడ్డ ఫాజీలి అహమ్మద్, షాయూబ్‌పాషాలు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు గురువారం పట్టణ ఏఎస్ఐ కిష్టప్ప తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మంత్రాలయంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం/కోసిగి: పెండింగ్‌లో పనులను పూర్తి చేయాలని, అవసరమైన పనులకు సంబంధించిన నివేదకలను సమర్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం మంత్రాలయం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రవి అధ్యక్షతన, కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యాక్రమంలో కోసిగి తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, మంత్రాలయం ఈఓపీఆర్డీ ప్రభావతి, ఎంఈఓలు మొయినుద్దీన్, రాఘన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించండి

ఆదోని రూరల్: బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను సేకరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్పెషల్ సమ్మర్ రివిజన్-2024లో భాగంగా హౌస్ టూ హౌస్ సర్వేపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటర్ కార్డు ఉండేలా చూడాలన్నారు. ఓటుహక్కు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల డీటీ రామేశ్వర్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వేముగోడులో డెంగీ బాధితుడి ఇంట్లో దోమల మందును పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. హెచ్.కైరవాడిలో ఓ బాలుడికి, వేముగోడులో మరో బాలుడికి డెంగీ నిర్ధారణ అయ్యింది. దీంతో గురువారం జిల్లా మలేరియా అధికారి నూకరాజు వైద్య సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో డెంగీ వ్యాధి సోకిన బాలుర ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల సమీపంలో ఉన్న నీటికుంటలు, నీటి గచ్చులు, డ్రమ్ములను పరిశీలించి నీటిని పారబోశారు. ఇంటింటికీ తిరిగి లార్వా సర్వే చేయించి దోమల మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఆస్పత్రి సూపర్ వైజర్లు, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వెలవెలబోయిన 'ఇది మంచి ప్రభుత్వం'

ఆదోని టౌన్: పట్టణంలోని వైఎంకే స్కూల్ క్రీడా మైదానంలో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జనం లేక వెలవెలబోయింది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించగా.. కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతుండగా సమావేశం నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, మహిళలు గుంపులు గుంపులుగా లేచి బయటకు వెళ్లిపోయారు. దీంతో సభా ప్రాంగణంలోనే కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఉత్తుత్తి మాటలే చెబుతున్నారంటూ ప్రజలు గుసగుసలాడుతూ బయటకు వెళ్లిపోవడం కనిపించింది.



సభా ప్రాంగణంలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

బాధితులకు అండగా ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు



నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : అధైర్య పడొద్దు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహాయ సహకారాలతో అండగా ఉంటామని గుడిసె దగ్ధమై సర్వం కోల్పోయిన మంచోది శాంతిరాజు కుటుంబానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి భరోసానిచ్చారు. బుధవారం రాత్రి పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన శాంతిరాజు గుడిసె మంటల్లో కాలిపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి రూ. 25వేలు ఆర్థిక సహాయం పంపించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన నాయకులు రవిచంద్రరెడ్డి, రామలింగారెడ్డి, శివరామిరెడ్డి అందరూ కలసి మరో రూ. 25వేలు సమకూర్చి బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు రూ. 50వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, బ్రహ్మయ్య, ముక్కరన్న, అర్లప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జడ రవి, సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం మండల అధ్యక్షుడు తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్ మాదిగ బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గోనెగండ్ల : పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుజాత తెలిపారు. గురువారం మండలంలోని వేముగోడ గ్రామంలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు మేలైన ఏన్‌బీఈజీ 452, 857, 776, 12 67 రకాల గురించి వివరించారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 లోపు విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఏఓ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

మిరప సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు మిరప పంట సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.కె. రాఘవేంద్రచౌదరి, డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మిరప రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓలు వరప్రసాద్, శశిధర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు మౌనిక, చందన, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో మందును పిచికారీ చేసే విధానాన్ని చూపుతున్న అధికారులు